## ఈసీఐఎల్ డైరెక్టర్ పర్సనల్‌గా అనురాగ్ మాల్వియా



చర్లపల్లి, అక్టోబర్ 16 : ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) డైరెక్టర్ పర్సనల్‌గా అనురాగ్ మాల్వియా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసీఐఎల్‌లోని హెచ్ఆర్‌డీలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ మాల్వియా డైరెక్టర్ పర్సనల్‌గా బాధ్యతలు చేపట్టడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకింత భావంతో పనిచేసి ఈసీఐఎల్‌కు గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

## బ్యాగుల దుకాణంలో అగ్ని ప్రమాదం

**రూ.10 లక్షల ఆస్తి నష్టం**

వనస్థలిపురం, అక్టోబర్ 16: వనస్థలిపురం పరిధిలోని ఓ బ్యాగుల దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్టు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంకు వద్ద ఉన్న స్కై బ్యాగ్ దుకాణం నుంచి సోమవారం తెల్లవారుజామున పొగలు వచ్చాయి. అనంతరం మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చి, ప్రమాదస్థలానికి వచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.10లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. షాపు యజమాని సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యువతులను వేధించినందుకు..

**నిందితులకు జైలు శిక్ష**

చార్మినార్, అక్టోబర్ 16 : అమ్మాయిని వేధించిన ఓ యువకుడికి న్యాయస్థానం సాధారణ జైలు శిక్ష విధించింది. ఈ ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. యాకుత్‌పుర ప్రాంతానికి చెందిన బక్షి అలి స్థానికంగా నివసించే ఓ అమ్మాయిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టుచేసి, సోమవారం నాంపల్లి 6వ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిందితుడికి మూడు రోజుల జైలు శిక్షను విధించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈవ్ టీజింగ్‌కు గురయ్యే బాధితులు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

### మరో ఘటనలో

యాకుత్‌పుర ప్రాంతానికి చెందిన అబ్దుల్లా అలియాస్ అబ్దుల్లా నబి స్థానికంగా నివసిస్తూ యువతులు, మహిళల పట్ల ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్నాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్ నబిని అరెస్టుచేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నిందితుడికి ఒకరోజు సాధారణ జైలు శిక్ష విధించారని తెలిపారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో పోలీసులు రెండు కేసుల్లోని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మెహిదీపట్నం, అక్టోబర్ 16: అనుమానాస్పదస్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కథనం వివరాల ప్రకారం.. నాగార్జున సాగర్ ప్రాంతానికి చెందిన వెంకటసాయి (21)మెహిదీపట్నంలోని సెంచరి అపార్టుమెంట్‌లో గత 4 నెలలుగా ఉంటున్నాడు. అతడు గచ్చిబౌలిలో ఉన్న ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా.. సోమవారం మధ్యాహ్నం వరకు అతడు ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు తలుపు కొట్టినా తీయలేదు. దీంతో స్థానికులు ఆసిఫ్‌నగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు తలుపులు విరగ్గొటి చూడగా.. తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని కిందకు దింపిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాక్టర్ బొల్తా పడి..

దుండిగల్, అక్టోబర్ 16: ట్రాక్టర్ అదుపుతప్పి గుంతలో పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ మరణించాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లాలోని ఖాజీపల్లికి చెందిన బోయ లావ (30) ట్రాక్టర్ డ్రైవర్. సోమవారం సాయంత్రం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేటకు ట్రాక్టర్‌పై వచ్చాడు. బౌరంపేటలోని మల్లన్నగుడి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న లావ తలకు, ఛాతీపై తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కవాడిగూడలో 2.09 కోట్లు పట్టివేత

### నగరంలో విస్తృతంగా తనిఖీలు

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ) : అక్రమంగా తరలిస్తున్న రూ. 2.09 కోట్ల నగదును నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాంధీనగర్ పోలీసులతో కలిసి పట్టుకున్నారు. ఎన్నికలలో నగదు, మద్యం, బంగారం, వెండి అక్రమ రవాణాను నిలువరించేందుకు నగరంలో ముమ్మరంగా వాహనాల తనిఖీని చేస్తున్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్, కవాడిగూడలో అనుమానాస్పద స్థితిలో వెళ్తున్న కారును పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అందులో రూ. 2.09 కోట్ల నగదు పట్టుబడింది. ఆధారాలు చూపకపోవడంతో ఆ డబ్బును పోలీసులు సీజ్ చేశారు. దీంతో పాటు కారులో ఉన్న దినేశ్ కుమార్ పటేల్, సచిన్‌కుమార్ విష్ణు భాయ్ పటేల్, జితేందర్ పటేల్, శివరాజ్ నవీన్‌బాయ్ మోడి, మీట్ రాకేశ్ పటేల్, ఠాగూర్ నాజి ఛటర్జీ పట్టుబడ్డారని టాస్క్‌ఫోర్స్ డీసీపీ (ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ సైదులు నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు.



కవాడిగూడలో పట్టుబడ్డ నగదు

### కూకట్‌పల్లిలో రూ.26.25 లక్షలు..

❑ కేపీహెచ్‌బీ కాలనీ : కేపీహెచ్‌బీ కాలనీలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. ఏ ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.26.25 లక్షల నగదును కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన రామకిషన్ (24), మంగతరామ్ సంతోష్(35) సోమవారం ఉదయం కారులో కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్ మీదుగా వెళ్తున్నారు. తనిఖీల్లో భాగంగా పోలీసులు ఆపి.. వాహనాన్ని తనఖీ చేశారు. కారులో రూ.26.25 లక్షల నగదును గుర్తించారు. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### జవహర్‌నగర్‌లో రూ. 12 లక్షలు..

❑ జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీసులు సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అంబేద్కర్‌నగర్‌లో ఎం. నాగప్ప వద్ద 4.50 లక్షలు, యాప్రాల్‌లో సారంగు సుధాకర్ వద్ద రూ.7,60,000ల నగదును పట్టుకున్నారు. సీజ్ చేసిన డబ్బును డిస్ట్రిక్ట్ ట్రెజరీ కార్యాలయంలో జమ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### మాదాపూర్‌లో రూ.32 లక్షలు..

❑ మాదాపూర్: మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి 100 ఫీట్ రోడ్డులో ఎస్‌ఓటీ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేకుండా ఓ కారులో రూ. 32 లక్షలు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం మాదాపూర్ పోలీసులకు అప్పగించారు.

### మియాపూర్‌లో నగలు, నగదు..

❑ మియాపూర్ : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోం జువెల్ వెనుక పైప్‌లైన్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన బిల్లులు లేకుండా ఓ కారులో తరలిస్తున్న 16 కిలోల బంగారం, 23 కిలోల వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా.. సోమవారం ఉదయం ఆల్విన్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ ద్విచక్ర వాహనదారుడు బ్యాగులో రూ. 14 లక్షలు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### మేడ్చల్‌లో రూ. 4.12 లక్షలు

❑ మేడ్చల్: మేడ్చల్ పోలీసులు డబిల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా.. నిజామాబాద్ నుంచి నగరం వైపు వస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శివ ప్రణయ్ వద్ద రూ.4.12 లక్షలు లభించాయి. అతడు ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. డబిల్‌పూర్ చెక్‌పోస్టును సోమవారం డీసీపీ అంబరీష్ సందర్శించి, వాహనాల తనిఖీలను పరిశీలించారు.

### జగద్గిరిగుట్టలో రెండు లక్షలు..

❑ జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీసులు దేవమ్మబస్తీ సమీపంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో గాజులరామారానికి చెందిన వ్యాపారి వెంకటేష్ వద్ద రూ.2లక్షలు లభించాయి.

### కుషాయిగూడలో రూ.30 లక్షలు..


❑ చర్లపల్లి: కుషాయిగూడ పోలీసులు సోమవారం తార్నాక థియేటర్ సమీపంలో నిర్వహించిన తనిఖీలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కాప్రాకు చెందిన నల్లా సతీష్‌కుమార్ వద్ద 30 లక్షల నగదు లభించింది.

### ఎస్ఆర్ నగర్‌లో రూ.9,81,250..

❑ వెంగళరావునగర్ : ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ. 9,81.250 నగదును ఎస్ఆర్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన వివరాలను చెప్పకపోవడంతో సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

## అనారోగ్యంతో మంత్రి తలసాని మామ మృతి

అబిడ్స్, అక్టోబర్16: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మామ మజ్జిగ నర్సింహ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని స్వామి దయానంద్‌నగర్ ప్రాంతంలో నివాసముండే ఆయన అంతిమ యాత్రను సోమవారం నిర్వహించారు. అంతిమ యాత్రలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆయన తనయుడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ పాల్గొని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంతిమ యాత్రలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమత సంతోష్ గుప్తా, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తం రావు పాల్గొన్నారు.



### ఫ్యాషన్ వాక్ అదుర్స్

కోకాపేట్ రాయ్ చందనీలో ఫ్యాషన్ వాక్‌తో నటీమణులు దీక్షాపంత్, స్నేహసింగ్, నజియాఖాన్, ఇతర మోడళ్లు ఆకట్టుకున్నారు. సోమవారం కాలాకుంజ్‌లో ఆకర్షణీయమైన డిజైన్లను ప్రదర్శిస్తూ సందడి చేశారు. కాలాకుంజ్ వ్యవస్థాపకుడు దినేశ్‌కుమార్ మఖారియా, డైరెక్టర్లు లలిత్ మఖారియా, అనుపమ్, హిమాన్షు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ)

## డ్రగ్స్ దందా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్ సరఫరా చేస్తున్న వ్యక్తి సహ డ్రగ్ వినియోగదారుడిని కూడా ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. బేగంపేటకు చెందిన సోలోమాన్ సున్నై రాజును గతంలో డ్రగ్ కేసులో అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అయినా తన ప్రవర్తన మార్చుకోలేదు. తిరిగి గోవాకు వెళ్లి ఆఫ్రికన్ దేశస్థుడైన ఫేవర్ వద్ద నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఇటీవల గోవాకు వెళ్లి వచ్చి డ్రగ్ విక్రయాలు సాగిస్తున్నట్టు ఎల్బీనగర్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ బృందానికి సమాచారం వచ్చింది. దీంతో, ఎల్బీనగర్ పోలీసులతో కలిసి డ్రగ్ అమ్ముతున్న సోలోమన్‌తో పాటు కొనుగోలు చేస్తున్న ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన దేవరై కృష్ణకాంత్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 27 ఎండీఎంఏ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## సెలూన్ యజమాని దారుణహత్య

మూసాపేట, అక్టోబర్16: పాపారాయుడునగర్‌లో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పోతన్‌శెట్టి గ్రామానికి చెందిన అశోక్(45) 8 ఏండ్ల కిందట నగరానికి వచ్చి పాపారాయుడునగర్‌లో హర్ష లుక్స్ పేరిట సెలూన్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి సెలూన్‌లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు షాపు షట్టర్లు మూసి కత్తులతో పొడిచి హత మార్చారు. షాపు షట్టర్లు మూసి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు.. షట్టర్ తీసి చూడగా అశోక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. అయితే, గతంలో సెలూన్‌లో పనిచేసిన పంకజ్(30), అశోక్ మధ్య గొడవ జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అదే పగతో అశోక్‌ను హత్యచేసి ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.